క్లుప్తంగా

కండలేరులో 11.452 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో గురువారం 11.452 టీఎంసీ నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 40 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 5, లోలెవల్ స్లూయిజ్‌కు 30 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు

హిటాచి స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న హిటాచి

సైదాపురం: తన పొలంలో అనుమతి లేకుండా ఓ వ్యక్తి అక్రమంగా ఖనిజ సంపదను తీసి తరలిస్తున్నాడంటూ సైదాపురం గ్రామానికి చెందిన పోలయ్య గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ చల్లా వాసు అక్రమంగా పోలయ్య పొలంలో తవ్వకాలను సాగిస్తున్న హిటాచి, లోడింగ్ చేసేందుకు సిద్ధంగా ఉన్న లారీని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. అక్రమంగా తవ్వకాలను సాగించిన భాస్కర్‌పై కేసును నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

ప్రతి పంట ఈక్రాప్ నమోదు



రైతుల వివరాలను చెబుతున్న వ్యవసాయ సహాయకురాలు

సైదాపురం: మండలంలో ప్రతి పంటను ఈక్రాప్ నమోదు చేశామని మండల వ్యవసాయాధికారిణి హైమావతి స్థానిక రైతు భరోసా కేంద్రంలో గురువారం ఈపంట నమోదు చేసిన రైతుల వివరాలను ప్రకటించారు. ఆమె మాట్లాడుతూ మండలంలో ప్రస్తుతం సాగు చేస్తున్న పంటలను ఈక్రాప్‌తో పాటు ఈకేవైసీ కూడా నమోదు చేశామన్నారు. మండలంలో 8,400 ఎకరాలను ఈపంట కింద నమోదు చేశామని చెప్పారు. ప్రతి రైతు భరోసా కేంద్రం వద్ద ఈక్రాప్ నమోదు చేసిన రైతుల వివరాలను నోటీస్ బోర్డులో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

సొసైటీలకు సబ్సిడీపై చేప పిల్లలు

చిల్లకూరు: చెరువుల్లో చేప పిల్లలను పెంచుకుని ఆదాయం పొందే ఎస్సీ, ఎస్టీ సొసైటీల సభ్యులకు రాయితీపై చేప పిల్లలను మత్స్యశాఖ ద్వారా ప్రభుత్వం అందించేందుకు సిద్ధంగా ఉందని గురువారం చిల్లకూరు మత్స్యశాఖాధికారి రఘుబాబు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆయన మాట్లాడుతూ మండలంలోని రామారెడ్డిపాళెం, చిల్లకూరు, ముత్యాలపాడు, కడివేడు గ్రామాల్లోని నాలుగు చెరువులు సొసైటీల పరిధిలో ఉన్నందున వీటిలో 13 లక్షల చేపల పిల్లలను వదిలేందుకు ప్రతిపాదనలు పంపగా మత్స్యశాఖ ఉన్నతాధికారులు ప్రతిపాదనలను ఆమోదించారని తెలిపారు. ఈ చెరువుల్లో చేప పిల్లలను వదిలిన అనంతరం సొసైటీ సభ్యుల పర్యవేక్షణలో వాటిని పెంచుకుని ఆ తరువాత పట్టుకుని ఆదాయం పెంపొందించుకునేందుకు అవకాశం కల్పిస్తామని చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఎం నేతలు

గూడూరురూరల్: ఈనెల 27న నెల్లూరులోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో జరిగే అసంఘటిత కార్మికుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని గూడూరు సీపీఎం సెంట్రల్ శాఖా కార్యదర్శి జోగి శివకుమార్ పిలుపునిచ్చారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో గురువారం రాష్ట్ర సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. సీఐటీయూ పట్టణ అధ్యక్షుడు బి.వి.రమణయ్య, కార్యదర్శి సురేష్, పాముంజి మణి, చంద్రయ్య, కె.వి.పి.ఎస్. పట్టణ కార్యదర్శి ప్రసాద్, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నేతలు పుట్టా శంకరయ్య, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నేతలు గోపి, కోటి పాల్గొన్నారు.

నేడు ధర్మ ప్రచార రథయాత్ర

దక్కిలి (బాలాయపల్లి): పెనుశిల లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించే ధర్మ ప్రచార వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం బాలాయపల్లిలో వెలసియున్న కోదండ రామస్వామి ఆలయ ప్రాంగణంలో ఉదయం 9గంటలకు పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, అమ్మవార్లు ఆదిలక్ష్మి, చెంచులక్ష్మిలతో ధర్మ ప్రచార రథయాత్ర ప్రారంభమవుతుందని ఓ ప్రకటనలో ఆలయ ఈఓ కె.జనార్దన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకురాలు రావి దేవికాచౌదరి పేర్కొన్నారు. సాయంత్రం 6గంటలకు స్వామి అమ్మవార్లు కల్యాణ మహోత్సవం, పురాణ ప్రవచనాలు, అన్నమాచార్యులకీర్తనల ఆలాపన కార్యక్రమాలు జరుగుతాయని పేర్కొన్నారు. భక్తులు పాల్గొని కల్యాణోత్సవాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

జగనన్న ఆరోగ్య సురక్ష ఓ వరం



సూళ్లూరుపేటలో వైద్యశిబిరంలో శ్రీమంత్‌రెడ్డి

సూళ్లూరుపేట రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు ఓ వరమని మున్సిపాలిటీ చైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి తెలిపారు. సూళ్లూరుపేట పట్టణంలోని బాపూజీకాలనీ సచివాలయ పరిధిలో స్థానిక సీఎస్సీ ప్రభుత్వ వైద్యశాల వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని గురువారం నిర్వహించారు. వైద్య శిబిరంలో 426 మంది వైద్య పరీక్షలు చేసుకున్నారు. ఇందులో అవసరమైన వారికి ఉచితంగా మందులు, కళ్లద్దాలు పంపిణీ చేశారు. మున్సిపాలిటీ కమిషనర్ నరేంద్ర పట్టణ పార్టీ అధ్యక్షుడు కళత్తూరు శేఖర్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు బాబురావు పాల్గొన్నారు.

రాపూరులో..

రాపూరు: నెల్లేపల్లిలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. వైద్యులు చందన్‌రెడ్డి, నర్మదాదేవి, అంజలి, సూర్యధర్మేంద్ర, ఎంఈఓ జిలాని, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పాపకన్ను దయాకర్‌రెడ్డి, నేతలు శ్రీధర్‌రెడ్డి,రమణారెడ్డి, పెంచలయ్య,వలంటీర్లు, వైద్యసిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పెళ్లకూరులో..

పెళ్లకూరు: పుల్లూరు ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ప్రత్యేక వైద్యనిపుణులతో శిబిరం నిర్వహించారు. వైద్యులు చంద్రమోహన్‌రెడ్డి, ఉమ, రాజశేఖర్, సందీప్, విష్ణుప్రియ, శ్రీకాంత్ వైద్యపరీక్షలు చేశారు. వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి చిందేపల్లి మధుసూదన్‌రెడ్డి, ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు నన్నం ప్రిస్కిల్లా, తహసీల్దార్ రామయ్య, ఎంపీడీఓ సురేష్‌బాబు, ఎంఈఓ సుబ్రమణ్యం, కార్యదర్శి మధుమోహన్ పాల్గొన్నారు.



లింగవరంలో వైద్యపరీక్షలు చేస్తున్న సిబ్బంది



నాయుడుపేటలో కిట్లు పంపిణీ చేస్తున్న అధికారులు, నేతలు

నాయుడుపేటలో..

నాయుడుపేటటౌన్: కాపులూరు పాఠశాల వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. సచివాలయ పరిధిలోని ప్రజలు వైద్యశిబిరానికి వచ్చి వైద్యపరీక్షలు చేసుకున్నారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సచివాలయ పరిధిలో అనేక మందికి ఆయుష్మాన్, డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డులు, కంటి వెలుగుకు సంబంధించి కంటి అద్దాలను పంపిణీ చేశారు. తహసీల్దార్ రాజేంద్ర, ఎంపీడీఓ శివప్రసాద్, ఎంపీపీ కురుగొండ ధనలక్ష్మి పాల్గొన్నారు.

దొరవారిసత్రంలో..

దొరవారిసత్రం: వేణుంబాకం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని అధికారులు నిర్వహించారు. ఈశిబిరంలో రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. స్థానిక వైస్ ఎంపీపీ దువ్వూరు గోపాల్‌రెడ్డి అన్నారు. వైద్యాధికారి చైతన్య, డాక్టర్ పళణిరాజ్, ఎంపీడీఓ రఘురామయ్య, సర్పంచ్ మధురెడ్డి, నేతలు మౌళ, సుభాన్, బాబు పాల్గొన్నారు.

చిల్లకూరులో..

చిల్లకూరు: లింగవరంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహించారు. 402 మంది వైద్య పరీక్షలు చేసుకున్నారు. అవసరమైన వారికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. అనంతరం వైద్యులు, అధికారులు, ప్రజాప్రతినిధులు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్‌ను పరిశీలించారు. చింతవరం, వగరలి పీహెచ్‌సీ వైద్యులు శ్రీపావని, గీతామణి, కళ్యాణ్, సర్పంచ్ నాశిన సుబ్రహ్మణ్యం, ఈఓపీఆర్‌డీ మాణిక్యం పాల్గొన్నారు.

ఓజిలిలో..

ఓజిలి: వజ్జవారిపాలెం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమాన్ని గురువారం ఎంపీడీఓ రజనీకాంత్ నిర్వహించారు. అంగన్‌వాడీ సిబ్బంది ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించి ఆరోగ్య సలహాలను ఆయన అందించారు. వైద్యులు రమేష్, మాధవ్, తహసీల్దార్ శివరామసుబ్బయ్య, సర్పంచ్ కొణిదల విజయమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు రవీంద్రరాజు, మండల కన్వీనర్ హరనాథ్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ఖాదర్‌బాషా, వ్యవసాయ సలహామండలి చైర్మన్ వేణురెడ్డి, నేతలు మధుసూదన్‌రెడ్డి, ఫణీందర్‌రెడ్డి, సుకుమార్‌రాజు, అజ్మతుల్లా, మురళి, నాగరాజు, పంచాయతీ కార్యదర్శి రమేష్ పాల్గొన్నారు.



నెల్లేపల్లిలో వైద్యపరీక్షలు



పుల్లూరులో కిట్ల పంపిణీ



వేణుంబాకంలో వైద్య పరీక్షలు



ఓజిలిలో మందుల పంపిణీ

వైఎస్సార్ బీమా నగదు పంపిణీ



బీమా నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

పెళ్లకూరు: సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య చేతులమీదుగా గురువారం జీలపాటూరు గ్రామానికి చెందిన గుంటపూడి అనురాధకు వైఎస్సార్ బీమా నగదును అందజేశారు. గ్రామంలోని దళిత కాలనీకి చెందిన మాజీ ఎంపీటీసీ, వైఎస్సార్‌సీపీ నేత గుంటపూడి చెంగయ్య(45)ఇటీవల మృతి చెందాడు. దీంతో వైఎస్సార్ బీమా పథకం కింద ముందస్తుగా రూ.10వేల నగదును ఎమ్మెల్యే అందజేశారు. బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు. అలాగే పెన్నేపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత గోగుతట్టు ఆనంద్ కుటుంబసభ్యులను ఎమ్మెల్యే సంజీవయ్య పరామర్శించారు. ఆనంద్ సోదరుడు రేవంత్(20) ఇటీవల మృతిచెందాడు. దీంతో పెన్నేపల్లిలోని ఆనంద్ ఇంటికి వెళ్లిన ఎమ్మెల్యే కుటుంబసభ్యులను పరామర్శించారు. ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు ఒబ్బు వెంకటరత్నం, నేతలు రఘునాయుడు, జితేంద్ర, ప్రసాద్, మునిరాజ, సుబ్బరాఘవయ్య, చెంగయ్య, కృష్ణయ్య గోపాల్ పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగికి నివాళి

కోట: కోట పంచాయతీ కార్యాలయంలో కాంట్రాక్ట్ ఉద్యోగిగా పనిచేస్తున్న సుబ్రమణ్యం(50) గురువారం అనారోగ్యంతో మృతిచెందాడు. ఆయన మృతదేహానికి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నల్లపరెడ్డి వినోద్‌కుమార్‌రెడ్డి నివాళులర్పించారు. ఆలయన మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో పంచాయతీ సెక్రటరీ శ్రీనివాసులు, మాజీ సర్పంచ్ పద్మమ్మ, వార్డు సభ్యుడు కిరణ్ ఉన్నారు.

అక్రమంగా మైనింగ్ చేసే వారిపై చర్యలు

సైదాపురం: మండలంలో అక్రమంగా మైనింగ్ చేసే వారిపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పంట శ్రీనివాసులురెడ్డి కోరారు. సైదాపురం తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం రెవెన్యూ అధికారులకు వినతి పత్రం అందజేశారు.

ఎన్‌బీకేఆర్‌లో టేబుల్ టెన్నిస్ టీం సెలెక్షన్స్

కోట: విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో గురువారం జేఎన్‌టీయూ టేబుల్ టెన్నిస్ టీం సెలెక్షన్స్ జరిగాయి. సెలక్షన్స్‌కు జేఎన్‌టీయూ అనంతపూరు పరిధిలోని ఏడు జిల్లాల నుంచి 75 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఐదుగురితో పురుషుల జట్టును, ఐదుగురితో మహిళల జట్టును ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులకు పదిరోజుల పాటు కళాశాలలో శిక్షణ ఇస్తున్నట్లు కళాశాల పీడీ మల్లిఖార్జున్‌రెడ్డి తెలిపారు.

28న తిరుపతిలో టీటీడీ ఆలయాల మూత

తిరుపతి కల్చరల్: పాక్షిక చంద్రగ్రహణంగా కారణంగా ఈనెల 28వ తేదీ శనివారం సాయంత్రం టీటీడీ స్థానిక ఆలయాలను మూసివేస్తారు. తిరిగి మరుసటి రోజు ఆదివారం ఉదయం తెరుస్తారు. ఈనెల 29న వేకువజామున 1.05 నుంచి 2.22 గంటల వరకు పాక్షిక చంద్రగ్రహణం ఉంటుంది. గ్రహణ సమయానికి 6 గంటల ముందుగా ఆలయ తలుపులు మూసివేయడం ఆనవాయితీ. ఇందులో భాగంగా తిరుచానూరు శ్రీపద్మావతీ అమ్మవారి ఆలయం, తిరుపతిలోని శ్రీగోవిందరాజస్వామి ఆలయం, శ్రీకోదండరామ స్వామివారి ఆలయం, శ్రీనివాస మంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో 28న రాత్రి 7 గంటలకు ఆలయ తలుపులు మూసివేస్తారు. తిరిగి 29న తెల్లవారుజామున 4.30 గంటలకు ఆలయ తలుపులు తెరుస్తారు.

ఎంఎస్‌ఎంఈ పార్కును మంజూరు చేయండి



మంత్రి గుడివాడ అమర్నాథ్‌తో చర్చిస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

- పరిశ్రమలశాఖా మంత్రిని కోరిన ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

గూడూరురూరల్: గూడూరు పరిసర ప్రాంతాల్లోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు గూడూరుకు ఒక ఎంఎస్‌ఎంఈ పార్కును మంజూరు చేయాలని పరిశ్రమల శాఖా మంత్రి గుడివాడ అమర్నాథ్‌ను గూడూరు ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు కోరారు. విజయవాడలోని మంత్రి కార్యాలయంలో గురువారం పరిశ్రమల శాఖా మంత్రి గుడివాడ అమర్నాథ్‌ను కలిసి గూడూరు అభివృద్ధికి చేయూత అందించాలని చర్చించారు. గూడూరు పట్టణానికి ఆటోనగర్ ఇచ్చినందుకు గూడూరు ప్రజల తరపున ప్రత్యేకంగా మంత్రికి ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు మాట్లాడుతూ గూడూరులో ఎంఎస్‌ఎంఈ పార్కు ఏర్పాటుకు 100 ఎకరాల స్థలం కూడా కేటాయించారన్నారు. ప్రస్తుత పరిశ్రమల శాఖా మంత్రి గుడివాడ అమర్నాథ్‌ను కలిసి గూడూరు నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఈ పార్కు ఎంతో ఉపయోగపడుతుందని వివరించినట్లు తెలిపారు. సానుకూలంగా స్పందించిన మంత్రి అమర్నాథ్ పార్కును తప్పనిసరిగా చేస్తామని హామీ ఇచ్చారన్నారు.

అభ్యంతరాలు ఉంటే తెలపండి



ఆర్బీకేలో రైతుల జాబితాను ప్రదర్శిస్తున్న అధికారులు

కలువాయి: ఖరీఫ్-2023లో కలువాయి మండలంలో 1,603 మంది రైతులు 4,422.23 ఎకరాల్లో పైరు సాగుకు నమోదు చేశామని మండల వ్యవసాయాధికారి వి.ప్రతాప్ తెలిపారు. కలువాయి ఆర్బీకేలో గురువారం జరిగిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. మండలంలోని ఆర్బీకేలలో నేటి నుంచి నాలుగు రోజులపాటు సామాజిక తనిఖీ నిమిత్తం రైతుల జాబితాలను ప్రకటిస్తామని తెలిపారు. నాలుగు రోజుల పాటు జరిగే గ్రామసభల్లో ముసాయిదా జాబితాలను, రైతుల వివరాలను ఆర్బీకే సిబ్బంది చదివి వినిపిస్తారని వివరించారు. రైతులకు ఏమైనా అభ్యంతరాలు ఉంటే వీఏఏలను సంప్రదించి అభ్యంతరాలను రాతపూర్వకంగా తెలియజేయాలన్నారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఇదే చివరి అవకాశమని, తుది జాబితా ప్రదర్శన తరువాత ఎటువంటి మార్పులు, చేర్పులు ఉండబోవని తెలియజేశారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సాగరమాల భూసేకరణలో రైతుల గుర్తింపు



రైతులతో మాట్లాడుతున్న ఆర్‌ఐ రమ్యస్వాతి

చిల్లకూరు: నారికేళపల్లి నుంచి మోమిడి మీదుగా నిర్మించనున్న సాగరమాల రహదారి నిర్మాణంలో భాగంగా మోమిడి రెవెన్యూలో సేకరిస్తున్న భూమికి సంబంధించిన రైతులను గుర్తించి వారికి పరిహారం అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు గురువారం రెవెన్యూ అధికారులు తెలిపారు. మోమిడి రెవెన్యూ పరిధిలోని వరగలి గ్రామ సమీపంలో సేకరిస్తున్న భూమిలో కాంట్రాక్టు సంస్థ పనులు మొదలు పెట్టడంతో రైతులు ముందుగా పరిహారం చెల్లించి పనులు చేపట్టాలని సంస్థ ప్రతినిధులను అడ్డుకున్నారు. దీంతో తహసీల్దార్ శ్రీనివాసులు, ఆర్‌ఐలు రైతులతో మాట్లాడి గతంలో వారిని ఒప్పించారు. మళ్లీ గురువారం ఆర్‌ఐ రమ్యస్వాతి క్షేత్ర స్థాయిలో సేకరిస్తున్న భూమి సాగులో ఎవరు ఉన్నారు అనే విషయాలను పరిశీలించి వారిని గుర్తించారు. ఆ తరువాత పరిహారం అందించేలా ఏర్పాట్లు చేస్తామని అన్నారు. వరగలి ఎంపీటీసీ దారా కోటేశ్వరరావు, వీఆర్‌ఓలు బాలాజి, నరసింహులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆయుధాలపై అవగాహన



ఆయుధాలపై అవగాహన కల్పిస్తున్న బెటాలియన్ అధికారులు

వెంకటగిరి రూరల్: మండలంలోని వల్లివేడు సమీపంలో ఉన్న 9వ బెటాలియన్‌లో అడిషనల్ కమాండెంట్ అరుణ్‌బోస్, అసిస్టెంట్ కమాండెంట్ ఆనందకన్నా ఆధ్వర్యంలో గురువారం పోలీసు కామ్మెమొరేషన్‌డే 2023 పురస్కరించుకుని వెంకటగిరిలోని కస్తూర్బాగాంధీ ఉన్నత పాఠశాల, పల్లాం, వాంపల్లి జెడ్పీ హైస్కూళ్లు, పలు ప్రైవేటు పాఠశాలలో చదువుతున్న 770 మంది విద్యార్థులకు ఆయుధ ప్రదర్శన నిర్వహించారు. ప్రత్యర్థి సైన్యాన్ని ఎలా ఎదుర్కోవాలి, విపత్తుల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆయుధాలను వినియోగించడంపై విద్యార్థులకు అధికారులు అవగాహన కల్పించారు. ఆర్‌ఎస్‌ఐ నందీశ్వరరావు, బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.

మేరా మట్టి మేరా దేశ్ కలశ యాత్ర



గూడూరు: మేరా మట్టి, మేరా దేశ్ ర్యాలీ



నాయుడుపేట: మెప్మా, పొదుపు మహిళలతో కలశాలలో మట్టి నింపుతున్న కమిషనర్ శ్రీనివాసరావు

గూడూరురూరల్: కేంద్ర ప్రభుత్వం యువజన సర్వీసుల క్రీడా మంత్రిత్వశాఖ అనుబంధ సంస్థ నెహ్రూ కేంద్రం తిరుపతి జిల్లా వారి సహకారంతో గూడూరు మున్సిపల్ చెన్నూరు-2లో మేరా మట్టి మేరా దేశ్ కలశ యాత్రను గురువారం నిర్వహించి ర్యాలీ చేశారు. పర్యావరణ సొసైటీ అధ్యక్షుడు ఓబీ రెడ్డి మాట్లాడుతూ నూతనంగా నిర్మించిన పార్లమెంటు భవనంలో అమరవీరుల చిహ్నాలుగా ఉద్యానవనాన్ని ఏర్పాటు చేస్తున్నారని అందులో దేశం నలు మూలల నుంచి మట్టిని సేకరించే ఏర్పాటులో భాగంగా ర్యాలీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మావుడూరు మోహన్, ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, సెక్రటరీలు, వలంటీర్‌లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

నాదేశం- నాభూమి కలశ యాత్ర ర్యాలీ

నాయుడుపేటటౌన్: పట్టణంలోని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు సారథ్యంలో చిత్తూరు నెహ్రూ యువ కేంద్రం వారు నాదేశం-నాభూమి కలశ యాత్ర ర్యాలీని గురువారం నిర్వహించారు. ముందుగా స్థానికంగా ఉన్న మట్టిని కలశాలలో సేకరించి వాటితో పాటు స్థానిక పొదుపు మహిళలు జాతీయ జెండాలను చేత పట్టుకుని మున్సిపల్ కార్యాలయం నుంచి పాత బస్టాండ్ వద్ద అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ముందుగా కార్యాలయం వద్ద వందేమాతరం గీతాలను ఆలపించి కార్యక్రమ ముఖ్యఉద్దేశాలను వక్తలు వివరించారు. అనంతరం పొదుపు మహిళలు, మెప్మా ఆర్పీలు, కార్యాలయ సిబ్బందిచే ప్రతిజ్ఞ చేశారు. స్వాతి ఎడ్యుకేషనల్ సొసైటీ సౌజన్యంతో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంబీసీ కో-ఆర్డినేటర్ ఎం.మోహన్ పాల్గొన్నారు.